క్లుప్తంగా

న్యాయానిదే అంతిమ విజయం



ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం న్యాయానిదేనని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మద్యం అక్రమ కేసులో అరెస్టు కాబడిన రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావడం హర్షదాయకమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బంది పెట్టడానికే కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ఈ మేరకు ఆయన రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఎంపీ మిథున్ రెడ్డిని కలిశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పార్లమెంట్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు ఉన్నారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది నామాల ప్రసాద్, సత్తి బాబు, కోళ్ల వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



ఇంటర్న్‌షిప్‌కు హాజరైన విద్యార్థులు

రంగంపేట: దసరా సెలవుల్లో విద్యార్థులకు సమగ్ర శిక్షా ద్వారా ఇంటర్న్‌షిప్ శిక్షణ అందిస్తున్నారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ, ఐఏఎస్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ విభాగంలో పది రకాల వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ చదువుతున్న పదో తరగతి విద్యార్థులను మంగళవారం స్థానికంగా ఉన్న ఎలక్ట్రానిక్స్ మరమ్మతు షాపులు, విద్యుత్ సబ్ స్టేషన్లకు తీసుకువెళ్లి, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ ఒకేషనల్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రధానోపాధ్యాయురాలు దాట్ల అరుణ అన్నారు. తమ పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్ ఎస్.సంజీవ కుమారి పది రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సంపద కన్నా ఆరోగ్యం మిన్న



మర్రిపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రంగంపేట: మానవుడికి సంపద కన్నా ఆరోగ్యం మిన్న అని విశ్రాంత ఉపాధ్యాయుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. మర్రిపూడి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జరిగిన స్వస్థనారీ అభియాన్ వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక ఆరోగ్య పథకంతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వైద్యులు సమ్మెలో ఉండటంతో సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మర్రి పూడి ఆయుష్మాన్ భవ సిబ్బంది ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన పలువురికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



మహిళకు చీర, నిత్యావసరాలు అందజేస్తున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వీరబాబు

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురంలోని సర్వ్ విత్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ ఆరో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచే ప్రతి సేవా కార్యక్రమం సమాజంలో మార్పు తీసుకొస్తుందన్నారు. నిరు పేదలకు అండగా ఉంటున్న సర్వ్ విత్ హార్ట్ సంస్థను అభినందించారు. ఆ సంస్థకు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం వీరబాబును సంస్థసభ్యులు ఘనంగా సన్మానించారు.

ఉగ్ర గోదావరి



బొబ్బిల్లంక - ములకల్లంక గ్రామాల మధ్య గోదావరి వరద ఉధృతి

- బొబ్బిల్లంక – ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవాహం
- నదిలో మునిగిపోయిన రహదారి
- బోటుపైనే ములకల్లంకకు ప్రయాణం
- అప్రమత్తమైన అధికారులు

సీతానగరం: అఖండ గోదావరి వరద మంగళవారం మరింత ఉగ్రరూపం దాల్చింది. మండలంలోని బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ బొబ్బిల్లంక రేవు వద్ద గోదావరిని పరిశీలించారు. అక్కడ వరద కారణంగా ములకల్లంక వెళ్లే రోడ్డు మునిగిపోయింది. దీంతో ప్రజలు బోటుపై రాకపోకలు సాగించాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనంతరం ములకల్లంకలో తహసీల్దార్ పర్యటించారు. అక్కడి ప్రజల యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొర్రేడు జిల్లా పరిషత్ హైస్కూల్లో పునరావాసం కేంద్రం ఏర్పాటు చేశామని, వరద మరింత పెరిగితే అక్కడకు రావాలని స్థానికులను కోరారు. పారిశుధ్యం, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని అక్కడి పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ములకల్లంక, బొబ్బిల్లంకల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. కాగా.. తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ ములకల్లంక వాసులు తమ గ్రామం విడిచి రావడానికి అంగీకరించడం లేదన్నారు. గోదావరి వరద మరింత పెరిగితే వారిని తరలిస్తామన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



బొబ్బిల్లంక రేవు నుంచి ములకల్లంకకు బోటుపై వెళుతున్న ప్రయాణికులు



ములకల్లంకలో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఆ రెండు హామీల అమలెప్పుడో?

- నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధిపై స్పష్టత కరవు
- ఆ ఊసే ఎత్తని సీఎం చంద్రబాబు
- ఎన్నికల సమయంలో ఆర్భాటంగా ప్రచారం

పెదపూడి: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకూ నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3 వేలు, ఆడబిడ్డ నిధి పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అధికారం చేపట్టి దాదాపు ఏడాదిన్నర పూర్తవుతున్నా వాటిని అమలు చేయలేదు. అసలు ఆ రెండు హామీల ఊసే ఎత్తడం లేదు. దీంతో నిరుద్యోగులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా సూపర్ సిక్స్ - సూపర్ హిట్ అంటూ కూటమి నాయకులు ప్రచారం చేసుకోవడం విశేషం.

పీ –4 పేరుతో కలరింగ్

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. కుట్రలో భాగంగా పీ–4 పథకంలో ఈ ఆడబిడ్డ నిధిని తోసేసి ఇచ్చానన్నట్లు కలరింగ్ ఇచ్చి మహిళలను బాబు నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల లోగో

ఉద్యోగాల కోసం..

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు బీఈడీ, టీటీసీ, ఇంటర్మీడియట్, పదో తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం ఆశపడేవారు నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది నిరుద్యోగులు ఉంటారనేది ఒక అంచనా. ఎన్నికల ముందు చంద్రబాబు తమ ఉమ్మడి మ్యానిఫెస్టోలో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం చేశారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

అరకొర అమలు

సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలన్నింటినీ అరకొరగా అమలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లికి వందనం కూడా కోతలు లేకుండా రూ.15 వేలు ఇస్తానని చెప్పి, అనంతరం లబ్ధిదారులను తగ్గించి రూ.13 వేలతో సరిపెట్టారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా ఏడాది తర్వాత మొదలు పెట్టారు. కేంద్రం ఇచ్చే డబ్బుతో కాకుండా రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక కేంద్ర సాయంతో కలిపి రూ.20 వేలు అని మాట మార్చారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు సిలిండర్లు అని చెప్పారు కానీ, సిలిండర్లకు ముందు డబ్బు చెల్లిస్తే ఆ తర్వాత తీరిగ్గా అవి వేస్తామని సెలవిస్తున్నారు. అవి కూడా అందరికీ పడడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం కూడా అన్ని బస్సులకు అమలు చేయకుండా కోత పెట్టారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరిగా కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైనా ఉద్యోగానికి లక్షలాది మందికి వయో పరిమితి దాటిపోతుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగభృతి అమలు చేయాలి.

– సాంబత్తుల చంటి, వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం ఎస్సీసెల్ కన్వీనర్

ఆడబిడ్డ నిధి సంగతేంటి?



18 ఏళ్లు నిండిన ఆడబిడ్డకు ప్రతి నెలా రూ.1500 ఇస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికలు జరిగి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు పూర్తయ్యాయి. నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డలు అందరూ నష్టపోయారు. ఆడబిడ్డ నిధి సంగతి తేల్చాలి.

– కె.భూలక్ష్మి, పెదపూడి

కన్యలతో గ్రామోత్సవం



కొంకుదురులో గ్రామోత్సవం చేస్తున్న కన్యలు

బిక్కవోలు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా కొంకుదురు గ్రామంలోని గోపాల రామానాయుడు వీధిలో మంగళవారం కన్యలతో గ్రామోత్సవం చేశారు. అర్చకులు రమణశర్మ, భాస్కరశర్మ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో 108 మందితో ముందుగా కన్యారాధన నిర్వహించారు. కార్యక్రమంలో బాల భక్త కమిటీ సభ్యులు చిన్నం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఎన్‌సీసీతో యువతకు క్రమశిక్షణ



రక్తదానం చేసిన ఎన్‌సీసీ క్యాడెట్లతో ఎయిర్ కమాండ్ నర్సింగ్ సైలానీ

రాజానగరం: యువతకు సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, క్రమశిక్షణతో జీవితాన్ని ఉన్నతంగా మలచుకునేందుకు ఎన్‌సీసీ తోడ్పడుతుందని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండ్ నర్సింగ్ సైలానీ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న రక్తదాన కార్యక్రమంతో పాటు ఎన్‌సీసీ క్యాడెట్లతో నిర్వహిస్తున్న వివిధ రకాల ఈవెంట్లను కూడా పరిశీలించారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆక్వా రైతులకు మేలు

పెదపూడి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ఆక్వా రైతులు, మత్స్య సహకార సంఘాల సభ్యులకు మేలు కలుగుతుందని పెదపూడి, సామర్లకోట మండలాల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రాయి నూకరాజు అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌పై మంగళవారం ఏపీత్రయం గ్రామంలో ఆక్వా రైతులు, మత్స్య సహకార సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ మత్స్యకారులకు అవసరమయ్యే వలలు, ఐస్ బాక్సులు, డీజిల్ ఇంజిన్లు, వేట పరికరాలు, స్టింకర్లు మొదలగు వాటిపై గతంలో అమలవుతున్న 12 శాతం నుంచి 18 శాతం జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించారన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సహాయకులు చాగంటి పరశురామ్, బి.అర్జున్, జి.మామిడాడ మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు పేరూరి రమణ, సంఘ సభ్యులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పెదపూడిలో ర్యాలీ

కేంద్రం ప్రకటించిన వస్తు సేవలు పన్ను (జీఎస్టీ) తగ్గింపు ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. పెదపూడి గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.



ఏపీత్రయంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నూకరాజు

మత్స్యరంగానికి ఆర్థిక ఉపశమనం

రాజానగరం: జీఎస్టీలో వచ్చిన మార్పుల ద్వారా రాష్ట్రంలో మత్స్య రంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని జిల్లా మత్స్య శాఖ అధికారి ఎస్. నిర్మలా కుమారి అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నరేంద్రపురంలో కొత్త జీఎస్టీపై 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' పేరిట మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సముద్రపు చేపలు, రొయ్యలు, చేప నూనెలపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించారన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు టి.సుమలత, ఎస్.గణేశ్వరరావు, ఎం.బ్రహ్మానందం, కె.హరీష్, సర్పంచ్ తంగెళ్ల ముసలయ్య, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బొర్రా ముత్యాలు, రాపాక ముసలయ్య పాల్గొన్నారు.



నరేంద్రపురంలో అవగాహన కల్పిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి నిర్మలా కుమారి

నాగంపల్లి వీఆర్‌ఏ మృతి



ఏసురత్నం (ఫైల్)

సీతానగరం: మండలంలోని నాగంపల్లి గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) సనమండ్ర ఏసురత్నం (79) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఏసురత్నానికి భార్య మంగమ్మ, నలుగురు వివాహమైన కుమార్తెలు ఉన్నారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాస్ మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం ద్వారా వచ్చిన మట్టి ఖర్చులకు రూ.15 వేలు అందించారు. వీఆర్ఏ మృతికి మండల అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏ సంఘ సభ్యులు సంతాపం తెలిపారు.

వైద్య ఖర్చులకు రూ.25 వేల ఆర్థిక సాయం



ప్రదీప్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సాయిబాబా తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్ఐసీ రూరల్ బ్రాంచి ఏజెంట్ ఎం.ప్రదీప్ కుటుంబ సభ్యులకు రూరల్ ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ మంగళవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా మాట్లాడుతూ ఏజెంట్ ప్రదీప్ అనారోగ్యానికి గురవడంతో వెంటనే వైద్యులతో మాట్లాడి అవసరమైన రక్తం ఏర్పాటు చేశామన్నారు. ఏజెంట్ల సహకారంతో రూ.25 వేలు అందించామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు జీకే చంద్రశేఖర్, రూరల్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మట్టా సత్యానారాయణ, కోశాధికారి ఎర్నాగుల రామ్మోహన్, ఈసీ మెంబర్లు కొత్త సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

అంకురార్పణ పూజలు ప్రారంభం

పెదపూడి: జి.మామిడాడ మణికంఠ స్వామి దేవస్థానంలో వారాహి అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించి మంగళవారం అంకురార్పణ పూజలు ప్రారంభమయ్యాయి. పండితులు కృష్ణ, చండి, మణి కుమార్ శర్మ, పెద్దింటి పద్మనాభాచార్యుల పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. యజ్ఞ కర్తలుగా సత్తి సుబ్బారెడ్డి, సత్యవతి, ఎస్వీవీ రామారెడ్డి, రోజా మహాలక్ష్మి దంపతులు కూర్చున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సత్తి భగవాన్ రెడ్డి, మండ రాజారెడ్డి, ద్వారంపూడి రాజారెడ్డి, డీఆర్‌కే రెడ్డి, ద్వారంపూడి వెంకట కృష్ణారెడ్డి, ద్వారంపూడి కొండారెడ్డి, సిద్ధార్థ సత్తిరెడ్డి, పడాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. ముక్తి దాయిని

- ఘనంగా దసరా సంబరాలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

పెదపూడి: దసరా శరన్నవరాత్ర ఉత్సవాలు వాడవాడలా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. పెదపూడిలోని సంఘం సెంటర్, మెయిన్ ప్రాథమిక పాఠశాల, శెట్టిబలిజ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, పార్టీ నాయకులు కాకర సాయిబాబు, నర్ల శ్రీను, కాకర ఏసుబాబు, మార్ని వెంకట్రావు, అందుగుల అబ్బు, చేవ సత్యనారాయణ, గార్లపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

- శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జి.మామిడాడ, సంపర, పెదపూడి, పెద్దాడ, రామేశ్వరం, ఏపీత్రయం, గండ్రేడు, కరకుదురు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. సంపరలో అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో సామూహిక కుంకుమ పూజలు, లలితా పారాయణ చేయించారు.



పెదపూడిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

జక్కంపూడి రాజా పూజలు

కోరుకొండ: కాపవరంలో రాజరాజేశ్వరి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఆయనతో పాటు రాజా, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావును ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జీ, ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో త్రిశక్తి పీఠంలో జగన్మాతను దుర్గాదేవిగా అలంకరించారు. పెద్ద ఎత్తున మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. పాత ఊరు తురక వీధిలో కొలువుతీరిన దేవీ పీఠంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. చిన్నారి బొబ్బిలి జస్విత వీర ధరణి.. దుర్గాదేవి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ధరణికోట శివాలయం వద్ద దేవీ పీఠంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాపవరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, దుర్గారావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో దేవీ సెంటర్, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి, శ్రీదేవి కనకనదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. దొంతమూరు మెయిన్ రోడ్డులో అమ్మవారిని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈలకొలను, వడిశలేరు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం గ్రామాల్లో పూజలు జరుగుతున్నాయి.

బిక్కవోలు: పందలపాకలోని శ్రీదేవి, రాజరాజేశ్వరి, సంతోషిమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. కొమరిపాలెం కనకదుర్గమ్మ, బిక్కవోలు పార్వతీ దేవి, ఊలపల్లిలో కనకదుర్గమ్మ, తొస్సిపూడి నవదుర్గ ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



అనపర్తిలో దుర్గామాత వేషధారణలో అలరించిన చిన్నారి



జి.మామిడాడలో కనక దుర్గాదేవి




వడిశలేరులో..



తొస్సిపూడిలో..



అనపర్తి పాత ఊరిలో అమ్మవారు



చంద్రేడులో మహాదుర్గాదేవిగా..